VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 330
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
శుక్రవారం 22 మే 2026

# ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా ప్రాజెక్టుల గ్రౌండింగ్

- 2028 చివరినాటికి ప్రాజెక్టులు ప్రారంభించేలా కార్యాచరణ
- మంత్రుల కమిటీ, అధికారులకు లక్ష్యం నిర్దేశించిన సీఎం
- పెట్టుబడిదారులకు సింగిల్ పోర్టల్ ద్వారా సేవలు
- భూ కేటాయింపుల్లో పర్యాటక ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యం
- గోవా ప్లస్‌గా సూర్యలంక బీచ్ - త్వరలో బాపట్ల మాస్టర్ ప్లాన్
- 23 నెలల్లో ఏపీకి 756 ప్రాజెక్టులు, రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు
- రాష్ట్ర యువతకు 21.20 లక్షలకు పైగా ఉద్యోగావకాశాలు
- ఎంఓయూలు, ఎస్ఐపీబీ ఆమోదం పొందిన ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష





**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల గ్రౌండింగ్ ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా జరగాలని, డిసెంబర్ 2028 కల్లా ప్రారంభమయ్యేలా చూడాలని మంత్రుల కమిటీ, అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్రం అను-సరిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని ఆచరణలో చూపాలన్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంఓయూల స్థితిగతులు, ప్రాజెక్టుల పురోగతిపై ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. మంత్రుల కమిటీ తీసుకున్న చర్యలు, ప్రస్తుత కార్యాచరణ, భవిష్యత్ ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈ 23 నెలల్లో రూ.21,64,258 కోట్ల విలువైన మొత్తం 756 ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చాయని, వీటితో 21,20,567 ఉద్యోగాలు వస్తున్నట్టు తెలిపారు. ప్రైవేటు రంగంలో ఏవియేషన్ ప్రాజెక్టులను ఆకర్షించేలా చర్యలు చేపడతామని లోకేష్ చెప్పారు. పెట్టుబడుల సాధనలో దేశంలోనూ, ప్రైవేటు రంగంలోనూ ఏపీ పేరు మార్మోగుతోందని, ఎంఎస్ఎంఈల అనుమతులు, ఇతర వివరాలను త్వరలోనే వెబ్ సైట్ ద్వారా అందిస్తామని లోకేష్ తెలిపారు.

**21 ప్రధాన ఆలయాలతో టెంపుల్ టూరిజం సర్క్యూట్..** ప్రాజెక్టుల గ్రౌండింగ్, అనుమతుల వివరాలు, ఉద్యోగాల కల్పనపై సింగిల్ పోర్టల్‌లో డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భూ కేటాయింపుల్లో మొదటగా పర్యాటక ప్రాజెక్టులకు, తర్వాత ఐటీ కంపెనీలకు ప్రాధాన్యత కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. టూరిజం, ఐటీ లాంటి ప్రాజెక్టులకు వినూత్నంగా మల్టీ పర్పస్ భవనాల నిర్మాణం చేపట్టే ఆలోచన చేయాలని సూచించారు. సూర్యలంక బీచ్ ఫ్రంట్ ను గోవా ప్లస్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేయాలని బాపట్ల బీచ్‌కు త్వరలో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏపీలోని 21 ప్రధాన ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం ప్రాజెక్టు వేగంగా చేపట్టాలన్నారు. ఐటీ ప్రాజెక్టులు తమ కార్యకలాపాలు 18 నెలల్లో ప్రారంభించేలా చూడాలని స్పష్టం చేశారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ తయారీ ప్రాజెక్టులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి సూచించారు.

**నౌకా నిర్మాణ రంగంలో విస్తృత అవకాశాలు ..** ట్రాన్స్‌మిషన్‌తో పాటు సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఏపీ నిర్దేశించుకున్న

2లో

# 'మావిగన్'ను ప్రతిపాదించింది అందుకే: జగన్

- స్కాముల కోసమే చంద్రబాబు అమరావతి అంటున్నారన్న జగన్
- కేసీఆర్ రూ. 615 కోట్లతో అత్యాధునిక సచివాలయాన్ని కట్టారని ప్రశంస
- 'మావిగన్'కు రాష్ట్ర ప్రజలు మద్దతు పలికారని వ్యాఖ్య



**అమరావతి,కలంకౌంటర్ :** చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న పెద్ద దురదృష్టమని వైసీపీ అధినేత జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల భవిష్యత్తులో కూడా ఏపీకి రాజధాని లేకుండా పోయే ప్రమాదం ఉందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాము ప్రతిపాదించిన 'మావిగన్' పేరు ఎత్తితేనే చంద్రబాబుకు గుండె ఆగిపోయేలా ఉందని, భయంతో మంత్రులతో బూతులు మాట్లాడిస్తున్నారని జగన్ విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా... సున్నా నుంచి ప్రారంభించాల్సిన అమరావతి కంటే, ఇప్పటికే అన్ని సదు-పాయాలు ఉన్న 'మావిగన్' ప్రాంతాన్ని ప్రత్యామ్నాయంగా చూపించామని జగన్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ ప్రతిపాదనకు మద్దతు పలికారని, ఆ వాస్తవాన్ని తట్టుకోలేకనే చంద్రబాబు తనపై, వైసీపీపై బురద జల్లుతున్నారని వైఎస్ జగన్ విమర్శించారు. అమరావతిలో కేవలం రోడ్లు, నీరు, డ్రైనేజీ వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలకే రూ. 2 లక్షల కోట్లు ఖర్చవుతుందని.. రాజధాని నిర్మాణం ఆచరణ సాధ్యం కాదని తెలిసినా చంద్రబాబు కేవలం స్కామ్‌ల కోసమే ముందుకు వెళుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే అమరావతి పేరుతో రూ. 47,387 కోట్లు అప్పు చేశారని, ఖజానా నుంచి మరో రూ. 9,200 కోట్లు ఖర్చు చేస్తూ రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో ఇప్పటికే రూ. 1,200 కోట్లతో నిర్మించిన

# బీసీ గురుకుల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్లు

-రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**తాడేపల్లి/అమరావతి,కలంకౌంటర్ :** విద్యతో పాటు క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమని, దీన్ని దృష్టిలో పెట్టుకునే బీసీ గురుకులాలు విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్, షూస్ అందజేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసం కలిగించడంతో పాటు వాటిలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ముగ్గురు క్రీడాకారులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి సవిత అభినందించారు. గత నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ రాజస్థాన్ లోని ఉదయ్ పూ-ర్ లో ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గుంటూరుకు చెందిన టి.నాగజ్యోతి 76 కేజీల విభాగంగా జూనియర్ స్థాయిలో పోటీ పడింది. బాలిక 355 కేజీలు ఎత్తి, జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం గెలిచుకుంది. అదే జూనియర్ స్థాయి విభాగంలో పోటీపడిన కె.సత్యరామ్ రాజ్ 53 కేజీల విభాగంలో 110 కేజీలు ఎత్తి జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం గెలుచుకున్నాడు. సబ్ జూనియర్ స్థాయి విభాగంగా పోటీపడిన వినోద్ కుమార్ 110 కేజీలు ఎత్తి, జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం సాధించాడు. ఈ ముగ్గురు క్రీడాకారులతో పాటు వారికి కోచింగ్ అందజేసిన ఎండీ కమ్రుద్దీన్ ను మంత్రి సవిత అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులతో విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ గురుకులాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్ లతో పాటు షూస్ కూడా అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. అంతకుముందు మంత్రి సవిత బంగారు పతకాలు సాధించిన ముగ్గురు క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



**మంగళగిరి నియోజకవర్గంలో పేదల ఇళ్లను క్రమబద్ధీకరించి పట్టాలు అందజేసిన విద్యా, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, రెవెన్యూ శాఖ మంత్రి అనగానీ సత్యప్రసాద్**

-మంగళగిరి,కలంకౌంటర్ :




# ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా ప్రాజెక్టుల గ్రౌండింగ్

(మొదటిపేజీ తరువాయి)

160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యాన్ని వేగంగా చేరుకోవాలని సీఎం అన్నారు. అయితే ఇప్పటికే 99 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ విద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించేలా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు త్వరితగతిన ఏర్పాటయ్యేలా చూడాలని సీఎం అన్నారు. 2027 డిసెంబరు నాటికి 46 ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు ఉత్పత్తి ప్రారంభించేలా నిరంతరం పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు చేయాలని సీఎం సూచించారు. షిప్ బిల్డింగ్ సెంటర్ నిర్మాణం, పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని చెప్పారు. నౌకా నిర్మాణ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని స్పష్టం చేశారు. వైద్యారోగ్య రంగ ప్రాజెక్టులు రాష్ట్రంలో ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. గడచిన 30 ఏళ్లుగా ఏపీలో భూసేకరణ గురించి వివాదాలు ఏర్పడలేదని...రైతులకు, పరిశ్రమలకు, ప్రభుత్వానికి ప్రయోజనం కలిగేలా భూ సేకరణ ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.

**పర్యావరణ హితంగా ప్రాజెక్టులు..** 'రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టుల్లో పర్యావరణ హిత టెక్నాలజీ వినియోగించాలని సీఎం సూచించారు. తీరప్రాంతాల్లో సముద్రంలోకి కాలుష్య కారకాలను విడిచిపెట్టకుండా చూడాలని అన్నారు. సూర్యలంక, నెల్లూరు మైపాడు వంటి బీచ్ ప్రాంతాల్లో పరిశుభ్రమైన పరిస్థితులు ఉండాలన్నారు. కాలుష్యాన్ని సముద్రంలోకి విడిచిపెడితే భవిష్యత్తులో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పరిశ్రమలకు ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేసే విషయంలోనూ త్వరితగతిన కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎంఎస్ఎంఈ రైట్ టూ బిజినెస్ యాక్ట్ వెంటనే అమల్లోకి తీసుకురావాలని...నమోదు చేసుకుని పరిశ్రమ ప్రారంభించుకునేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. పరిశ్రమలు, ఎంఎస్ఎంఈల్లో



తయారయ్యే ఉత్పత్తులు నాణ్యతపై దృష్టి పెట్టాలని.. ప్రోడెక్టు పర్ఫెక్షన్ పై ప్రత్యేకంగా ఫోకస్ చేయాలన్నారు. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా ప్రాజెక్టులను సాకారం చేసేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం అన్నారు.

**ఎస్ఐపీబీ ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో 114 గ్రౌండింగ్..** రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.11.47 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి మొత్తం 282 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 4.32 లక్షల కోట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరం -- రూ. 4.72 లక్షల కోట్లు, 2026-27లో (ఈనెల వరకు) -- రూ. 2.39 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. వీటిలో ఇప్పటికే 114 గ్రౌండింగ్ అయ్యాయి. 2026 సెప్టెంబర్ నాటికి అన్ని ప్రాజెక్టుల గ్రౌండింగ్ లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇందుకోసం పర్యావరణం సహా ఇతర అనుమతులు, విద్యుత్, నీరు, రహదారులు వంటి మౌలిక వసతులు, భూముల రిజిస్ట్రేషన్, స్థానిక సమస్యల పరిష్కారం వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. బీపీసీఎల్, ఇండోసోల్, శ్రీ సిటీ ఫేజ్-×× వంటి ప్రాజెక్టులకు భూసేకరణ అత్యంత వేగంగా కొనసాగుతోందని, బీపీసీఎల్ ప్రాజెక్టుకు అవసరమైన సుమారు 3,000 ఎకరాల్లో 2,000 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ కేవలం మూడు రోజుల్లో పూర్తి చేసినట్టు అధికారులు వివరించారు.

**అంశాల పరిష్కారానికి మంత్రుల కమిటీ కృషి..** పరిశ్రమల గ్రౌండింగ్ వేగవంతం కోసం మంత్రుల కమిటీ కృషి చేస్తుండగా, విదేశాల నుంచి రాష్ట్రంలో ఏర్పాటు చేసే పెట్టుబడుల వివరాలను ఈడీబీ సేకరిస్తోంది. అన్ని శాఖల పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు ఐటీ పోర్టల్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల కమిటీ ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహిస్తోంది. ప్రాజెక్టుల వేగవంతమైన గ్రౌండింగ్ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు నిర్దేశిత గడువులోగా కార్యకలాపాలు చేపట్టేలా చూడాలని మంత్రుల కమిటీకి సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# స్త్రీ శక్తి థీమ్‌తో మహానాడు-2026

- 20 తీర్మానాలను చేపట్టాలని టీడీపీ పొలిట్ బ్యూరోలో నిర్ణయం
- పండుగలా మహానాడు నిర్వహించాలన్న టీడీపీ అధినేత


**అమరావతి,కలంకౌంటర్ :** మహానాడు-2026ను స్త్రీ శక్తి థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ పొలిట్ బ్యూరో నిర్ణయించింది. 20 తీర్మానాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. గురువారం పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం వర్చువల్‌గా జరిగింది. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా వర్చువల్‌గా జరిగిన ఈ పొలిట్ బ్యూరో భేటీలో సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం చంద్రబాబు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పాల్గొనగా... వేర్వేరు ప్రదేశాల నుంచి మిగిలిన పొలిట్ బ్యూరో సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో మహానాడు నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. ఏయే తీర్మానాలు ప్రవేశపెట్టాలి... తీర్మానాల్లో సారాంశం ఏ విధంగా ఉండాలి.. వంటి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచనలు చేశారు. ఈ నెల 27, 28వ తేదీల్లో జరగనున్న మహానాడులో మొత్తంగా 20 తీర్మానాలను ప్రవేశపెట్టాలని పొలిట్ బ్యూరోలో నిర్ణయించారు. వీటిల్లో 10 ఏపీ, 4 తెలంగాణ, 1 అండమాన్ కు సంబంధించి తీర్మానాలు ఉన్నాయి. వీటితో పాటు మరో 4 ఉమ్మడి తీర్మానాలతో పాటు... అంతిమంగా కీలక రాజకీయ తీర్మానం చేపట్టాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. ఇక



2026 మహానాడును స్త్రీ శక్తి థీమ్ తో నిర్వహించాలని నిర్ణయించడంతో... దాన్ని ప్రతిఫలించేలా మహానాడు ఉండాలని.. అలాగే ప్రసంగాలు ఉండాలని సీఎం ఆదేశించారు. పార్టీ ఆవిర్భావం నుంచి మహిళలకు, మహిళా సాధికారతకు, వారికి హక్కులు కల్పించే విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారనే అంశాన్ని వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతీ పథకంలోనూ మహిళలను భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకుంటున్నామనే విషయాన్ని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. వీటితో పాటు ప్రభుత్వం అమలు చేసే పథకాలు, చేపడుతోన్న కార్యక్రమాలు, చేస్తున్న అభివృద్ధి, వస్తున్న పెట్టుబడులు వంటి వాటిపై కూలంకుషంగా చర్చించాలని సీఎం ఆదేశించారు. ఈ మహానాడులో జరిగిన చర్చతో రాష్ట్రంలో అమలవుతున్న పథకాలపై మరోసారి చర్చ జరగాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇక మన దేశం-మన బాధ్యత పేరుతో పొదుపు చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రత్యేకంగా చర్చ జరపాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అరాచకాలను, కుట్రలను బహిర్గతం చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచేలా ఉండాలని పొలిట్ బ్యూరో అభిప్రాయపడింది. ఇక తెలుగుదేశం చరిత్ర, ఎన్టీఆర్ సిద్ధాంతాలపై నేటి తరానికి తెలిసేలా మహానాడులో ప్రజెంటేషన్స్ ఇవ్వనున్నారు. హైబ్రీడ్ పద్ధతుల్లో ఈసారి మహానాడు జరుగుతున్నా... మహానాడు స్ఫూర్తి మాత్రం కొనసాగాలని సీఎం సూచించారు. మహానాడు కార్యక్రమాన్ని పండుగలా చేపట్టాలని పొలిట్ బ్యూరో సమావేశంలో సీఎం చంద్రబాబు సూచించారు. రెండు రోజుల ముందు నుంచి ప్రతి ఇంటిపై టీడీపీ జెండా ఎగరేయాలన్నారు. పార్టీ అగ్రనాయకత్వం మొదలుకుని క్షేత్ర స్థాయి కార్యకర్త వరకు మహానాడులో భాగస్వాములను చేసేలా నిర్వహించాలని టీడీపీ అధినేత ఆదేశించారు. ఇక అన్ని క్లస్టర్లల్లో ఎన్టీఆర్ విగ్రహం పెట్టి మహానాడును ప్రారంభించాలని పొలిట్ బ్యూరో సమావేశంలో నిర్ణయించారు.

# 48.1 డిగ్రీలు... పిడుగురాళ్లలో రాళ్లు పగిలే ఎండ!

- నిప్పుల కొలిమిలా ఏపీ
- పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత
- పలు జిల్లాల్లో 47 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా నమోదు
- వచ్చే సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగుతుందని హెచ్చరిక



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లో వేసవి తన ప్రతాపాన్ని తీవ్రస్థాయిలో చూపిస్తోంది. రాష్ట్రం అగ్నిగుండాన్ని తలపిస్తుండగా, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పిడుగురాళ్లలో నిన్న 47.6 డిగ్రీలుగా నమోదైన ఉష్ణోగ్రత, ఇవాళ మరింత పెరిగి 48.1 డిగ్రీలకు చేరింది. రాష్ట్రంలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం. ఇక ఇతర ప్రాంతాల్లోనూ భానుడు భగభగమంటున్నాడు. బాపట్ల జిల్లా వేటపాలెం, కృష్ణా జిల్లా నందివాడలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎన్టీఆర్ జిల్లా టి.గుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీలు, ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నెల్లూరు జిల్లా కావలిలో 46.4 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నాడు 18 జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా, 20 జిల్లాల్లోని సుమారు 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు కీలక సూచనలు చేసింది. వచ్చే సోమవారం వరకు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఇదే విధంగా కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది.

# మండే ఎండల్లో చల్లని మనసు..

- ఎక్కడికక్కడ చలివేంద్రాలు, నీటి తొట్టెల ఏర్పాటు
- మనిషికే కాదు... మూగజీవాల దాహార్తినీ తీర్చుతున్న అధికార యంత్రాంగం
- ఓ చిన్న నీటి పాత్ర.. ఎన్నో ప్రాణాలకు జీవధార: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ,కలంకౌంటర్ :** మండు వేసవిలో ప్రజలు, పక్షులు, పశువులు దాహంతో ఇబ్బందులు పడకుండా జిల్లా యంత్రాంగం మానవత్వంతో ముందుకు సాగుతోంది. జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాల్లో సందర్శకులు, పక్ష్యాదుల కోసం ప్రత్యేక తాగునీటి ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో పశువుల తొట్టెలను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ చలివేంద్రాలు ఏర్పాటు చేసి.. నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన నీటి పాత్రల వద్ద వివిధ రకాల పక్షులు నీరు తాగుతున్న దృశ్యాలు ప్రతి ఒక్కరి మనసును హత్తుకుంటున్నాయి. మండుతున్న ఎండల్లో జీవరాశుల దాహార్తిని తీర్చేందుకు అధికారులు చూపుతున్న చొరవ మానవత్వం, బాధ్యతాభావం హృదయాలను హత్తుకుంటున్నాయని, పర్యావరణ పరిరక్షణ పట్ల మన నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయంటూ కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు పేర్కొన్నారు. ఒక చిన్న నీటి పాత్ర ఎన్నో ప్రాణాలను కాపాడగలదని.. ప్రతి ఇల్లు, కార్యాలయం, విద్యాసంస్థ, కాలనీలో పశుపక్ష్యాదులు, మూగజీవుల కోసం నీటి పాత్రలను ఏర్పాటు చేసి ఈ మంచి కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని.. దయను ఒక సామాజిక ఉద్యమంగా మార్చుకుందామని, మానవత్వపు దారిలో సుస్థిర అభివృద్ధి దిశగా పయనిద్దామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.

# పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఎక్కడా చిన్న పొరపాటుకు తావులేకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,కలంకౌంటర్ :** పదో తరగతితో పాటు ఏపీవోఎస్ఎస్ ఎస్ఎస్సీ, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని.. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సమన్వయ శాఖల అధికారులు విధులు నిర్వర్తించాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన గురువారం కలెక్టరేట్ శ్రీ పీవీఎస్ రెడ్డి హాల్‌లో ఎస్ఎస్సీ, ఏపీవోఎస్ఎస్ - ఎస్ఎస్సీ, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్సీ పరీక్షలు ఈ నెల 25 నుంచి జూన్ 4 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని అదేవిధంగా ఏపీవోఎస్ఎస్-ఎస్ఎస్సీ, ఇంటర్ పరీక్షలు మే 25వ తేదీ నుంచి జూన్ 1 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ఎస్ఎస్సీ పరీక్షలకు 4,017 మంది, ఏపీవోఎస్ఎస్-ఎస్ఎస్సీ పరీక్షలకు 1,259 మంది, ఏపీవోఎస్ఎస్-ఇంటర్ పరీక్షలకు 1,604 మంది మొత్తం 6,880 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఎస్ఎస్సీ పరీక్షలకు 25 కేంద్రాలు, ఏపీవోఎస్-ఎస్-ఎస్ఎస్సీ పరీక్షలకు 8, ఏపీవోఎస్ఎస్-ఇంటర్ పరీక్షలకు ఏడు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, భద్రత వంటి అన్ని ఏర్పాట్లు ఉండాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. ప్రశ్నపత్రాల రవాణా నుంచి పరీక్షల ముగింపు వరకు ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎక్కడా చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. పోలీసు, ఏపీఎస్ ఆర్టీసీ, వైద్య ఆరోగ్యం, విద్యుత్, రవాణా రెవెన్యూ, మునిసిపల్ తదితర శాఖల అధికారులు పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో నిబద్ధతతో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో డీఈవో ఎల్.చంద్రకళ, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కమిటి చైర్మన్ గా వలబట్ల ఆనంద్ బాబు



**హైదరాబాద్,కలంకౌంటర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య మహాసభకు కేటాయించిన స్థలంలో ఉప్పల్ భగాయత్ లో తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ నూతన భవన నిర్మాణ కమిటీకి విశిష్టగోల్డ్ అండ్ డైమండ్స్ అధినేత వి ఆనంద్ బాబును రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ నియమించి నియా మకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీనారా యణ మాట్లాడుతూ... రెండు సంవత్సరాల కాల పరిమితిలో భవన నిర్మాణాన్ని ఆర్యవైశ్య మహాసభ సహకారంతో పూర్తి చేసేందుకు కృషిచేయాలని ఆయన సూచించారు. అందరి సహకారంతో భవనాన్ని నిర్మించనున్నట్లు పలబట్ల ఆనంద్ బాబు తెలిపారు. తనను ఉప్పల్ భగాయత్ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా నియమించినందుకు ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రెచ్చిపోయిన గొలుసు దొంగ

కళ్లల్లో స్ప్రే కొట్టి రెండు తులాల గొలుసు అపహరణ

**విశాఖపట్నం,కలంకౌంటర్ :** బంగారం ధర రోజురోజుకూ పెరిగిపోతుండడంతో దొంగల కళ్లు ఆభరణాలపై పడుతున్నాయి. విశాఖలోని పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేపగుంట ప్రాంతంలో ఒక మహిళ కళ్ళల్లోకి స్ప్రే కొట్టి రెండు తులాలు గొలుసును దుండగులు పట్టుకుపోయారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. వేపగుంటలోని పద్మావతి నగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని దువ్వాకుల లక్ష్మి సింహపురి కాలనీలో ఉన్న బ్యాంకుకు వచ్చారు. బ్యాంకులో పని ముగించుకుని తిరిగి తన ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని ఒక వ్యక్తి స్కూటీపై ఆమె వెనుక నుంచి వచ్చి కళ్లలోకి స్ప్రే కొట్టాడు. ఈ హఠాత్ పరిణామానికి లక్ష్మి నిర్ఘాంతపోయింది. కళ్లలో మంటతోనే కేకలు వేసింది. అదే సమయంలో ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును స్కూటీపై వచ్చిన వ్యక్తి తెంచుకుని ఒక్క ఉదుటున పరారైపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పెందుర్తి క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహిళలు బయటకు వెళ్లేటప్పుడు బంగారు ఆభరణాలు ధరించొద్దని, కష్టార్జితం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎసఐ సూరిబాబు హెచ్చరించారు.

## గుడివాడ ఆలయ కిరీటం మాయం వ్యవహారం..

## గురువారం 11 గంటలకల్లా అలంకరించాలని యలవర్తి డెడ్‌లైన్

- కిరీటం అలంకరించే వరకు ఆలయంలోనే ఉంటా.. లేదంటే భక్తులతో యాక్షన్ ప్లాన్: యలవర్తి శ్రీనివాసరావు



**గుడివాడ,కలంకౌంటర్ :** గుడివాడ శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కోటి రూపాయల బంగారు కిరీటం మాయమైన వ్యవహారంపై విచారణ జరుగుతుండగా ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ఆలయానికి చేరుకున్నారు. దేవస్థాన ట్రస్ట్ బోర్డు చేసిన ఘోర తప్పిదంపై యలవర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు చేసిన తప్పు వల్ల గుడివాడకు చెడ్డపేరు వస్తుందని కమిటీ సభ్యులకు ఫోన్ చేసి చెప్పానని ఆయన తెలిపారు. భక్తుల తరపున గురువారం ఉదయం 11 గంటలకల్లా కిరీటాన్ని స్వామివారికి అలంకరించాలని డెడ్‌లైన్ పెట్టామని స్పష్టం చేశారు. కమిటీ సభ్యులు స్పందించకపోవడంతో కిరీటం అలంకరించే వరకు ఆలయంలోనే భీష్మించి కూర్చుంటానని యలవర్తి తేల్చిచెప్పారు. కిరీటం తాకట్టు పెట్టుకున్న బంగారు వ్యాపారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవుడి విషయంలో జరిగిన అపచారం భక్తులను కలచివేసిందని, ఈ విషయంపై ఉన్నత స్థాయికి వెళ్తానని యలవర్తి హెచ్చరించారు. సాయంత్రం లోపు కిరీటం అలంకరించకుంటే భక్తులతో కలిసి యాక్షన్ ప్లాన్‌లో దిగుతామని, భక్తుల మనోభావాలతో చెలగాటమాడితే సహించేది లేదని స్పష్టం చేశారు.

## 'మావిగన్'ను ప్రతిపాదించింది అందుకే: జగన్



(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ తాత్కాలిక భవనాలు ఉన్నప్పటికీ, మళ్లీ కొత్తగా కడతామనడం విచ్చలవిడి దోపిడీకి నిదర్శనమన్నారు. కొత్తగా నిర్మించ తలపెట్టిన 5 బిల్డింగ్‌ల అంచనాలను జగన్ ప్రశ్నించారు. ఈ ఐదు బిల్డింగుల డిజైన్లకే రూ. 401 కోట్లు తగలేశారని, మొత్తం నిర్మాణ ఖర్చు రూ. 10,665 కోట్లుగా చూపించారని లెక్కలు కట్టారు. "ప్రస్తుత అంచనాల ప్రకారం చదరపు అడుగుకు నిర్మాణ వ్యయం రూ. 20,427 అవుతోంది. దీనికి ఫర్నీచర్, ఇంటీరియర్ ఖర్చులు కూడా కలిపితే చదరపు అడుగుకు రూ. 30 వేలు దాటుతుంది. ఫైవ్‌స్టార్ హోటళ్ల నిర్మాణానికే చదరపు అడుగుకు రూ. 4,500 లోపు ఖర్చవుతుంటే, ఇక్కడ ఇంత భారీ ఖర్చు దేనికి?" అని జగన్ నిలదీశారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో కేసీఆర్ కేవలం రూ. 615 కోట్లతోనే అత్యంత ఆధునిక సచివాలయాన్ని నిర్మించారని, కానీ ఏపీలో మాత్రం కొత్త టెండర్ల పేరుతో పాత కాంట్రాక్టర్లకే పనులు ఇస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు.

# సమాజ నిర్మాణంలో సీనియర్ సిటీజన్ల అనుభవం, స్వచ్ఛంద సంస్థల పాత్ర అనన్యం -- ప్రముఖ సామాజికవేత్త కర్లపాటి




**విజయవాడ,కలంకౌంటర్ :** సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి స్వచ్ఛంద సేవా సంస్థల భాగస్వామ్యంతో పాటు, అనుభవజ్ఞులైన సీనియర్ సిటీజన్ల మార్గదర్శకత్వం ఆవశ్యకమని ప్రముఖ సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం 7:00 గంటలకు ఎన్టీఆర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆ సంస్థ అధ్యక్షులు వేమూరి బాబురావు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. వృద్ధాప్యం అనేది విశ్రాంతికి మాత్రమే పరిమితం కాకూడదని, సీనియర్ సిటీజన్ల విలువై న నైపుణ్యాలు, దశాబ్దాల జీవిత అనుభవం సమాజ ప్రగతికి, ముఖ్యంగా స్వచ్ఛంద సంస్థల సేవా కార్యక్రమాలకు దిక్సూచిగా మారాలన్నారు. హాజరైన వారిని భాగస్వామ్యం చేస్తూ సాగిన ప్రసంగం సభికులను ఎంతగానో ఆకట్టుకుంది.

**రూ. 5,000 విరాళం అందజేత:** సేవా స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లేలా, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలకు మద్దతుగా కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ. 5,000/- (ఐదు వేల రూపాయలు) నగదును అసోసియేషన్ ప్రతినిధులకు వితరణగా అందజేశారు. ఈ విరాళాన్ని స్వీకరించిన అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మరియు సభ్యులు వారి ఉదారతకు, సమాజ సేవ పట్ల వారికున్న నిబద్ధతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సంస్థ కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్వరరావు వందన సమర్పణ చేయగా ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల ప్రతినిధులు మరియు సీనియర్ సిటీజన్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహిళల రక్షణ, భద్రతకు కఠిన చర్యలు చేపడుతున్నాం - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం పట్టణం కంటోన్మెంట్ రెల్లివీధిలో విజయనగరం 1వ పట్టణ పోలీసులు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ముందుగా అక్కడ ఉన్న డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి జిల్లా ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి మహిళలతో మమేకమై వారికి మహిళల భద్రతకు జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను వివరించి, వారి భద్రతకు భరోసా కల్పించారు. అదేవిధంగా యువత చెడు వ్యసనాలకు, గంజాయికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ -- ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిణామాలు చుస్తే చాలావరకు మహిళలే బాధితులుగా ఉంటున్నారని అన్నారు. ఆడవాళ్ళు పని నిమిత్తం బయటకు వెళ్ళేటప్పుడు ఆడపిల్లలను ముఖ్యంగా 12 సం.ల వయసు లోపల ఉన్న పిల్లలను ఇంటి దగ్గర విడచిపెట్టి వెళుతున్నారని, దీన్ని గమనించి చుట్టుపక్కల ఉంటున్న కొంతమంది ఆ పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలను మనం చూస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లాలో చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడిన సుమారు 40మందికి జీవిత కాలం జైలు శిక్ష పడేటట్లు చేసామని జిల్లా ఎస్పీ తెలిపారు. అమ్మాయిలు భవిష్యత్తుకు పునాదులని వాళ్ళను కాపాడుకోవడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యతని అన్నారు. సమాజంలో మంచి గుర్తింపు ఉండాలంటే చదువు ఒక్కటే సరైన మార్గమని, కావున పిల్లలను మంచి చదువులు చదివించి వారి భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దాలని తల్లితండ్రులను కోరారు. ఎక్కడ మహిళలు, పిల్లలు గౌరవించబడతారో, ప్రశాంతమైన వాతావరణంలో జీవిస్తారో ఆ ప్రాంతం ఉన్నత స్థానానికి చేరుకుంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రతీ ఒక్కరి మొబైల్ ఫోనులో శక్తి యాప్ డౌన్లోడు చేసుకోవాలని, సమాజంలో అందరూ మంచి వాళ్ళే ఉండరని, కొంతమంది చెడ్డ వాళ్ళు కూడా ఉంటారని, అటువంటి వారితో ఏదైనా ఇబ్బంది వుంటే ఆపద సమయంలో పోలీసుల సహాయంను పొందేందుకు శక్తి (ఎస్.ఓ.ఎస్.) బటన్ ప్రెస్ చేయడం లేదా డయల్ 100/112 ఫోన్ చేసి వెంటనే పోలీసుల సహాయం పొందవచ్చునని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. మహిళల రక్షణ, భద్రతకు జిల్లా పోలీసుశాఖ అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందని, మహిళల రక్షణ కోసమే జిల్లా పోలీసులు ఉన్నామని, మహిళలు, పిల్లలు ఏ సమయంలోనైనా నిర్భయంగా బయట తిరగగలిగే వాతావరణం కలిపిస్తామని ప్రజలకు భరోసా కల్పించారు. మహిళల భద్రత పట్ల ఒకవైపు మహిళలను చైతన్యం చేయడం, ఆపద సమయాల్లో తమ స్వీయ రక్షణకు ఆత్మరక్షణ మెళుకువలు విద్యార్థినులకు నేర్పించడం, వారికి రక్షణగా ఉండే చట్టాలు పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. చెడ్డ పనులు చేసేవారు ఇప్పటికైనా పరివర్తన చెంది సమాజంతో పాటు నడవాలని లేని పక్షంలో వారిపై కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ హెచ్చరించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు సమాచారం తెలిస్తే డయల్ 100/112 ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని జిల్లా ఎస్పీ తెలిపారు. యువత క్రికెట్ బెట్టింగులకు పాల్పడడం, గంజాయి, మద్యం వంటి చెడు వ్యసనాలకు లోనవుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని, సమయాన్ని, సాంకేతికతను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. విజ్ఞానాన్ని పెంచుకొనేందుకు ఇంటర్నెట్ను వినియోగించుకోవాలని, సోషల్ మీడియా, రీల్స్, ఫేస్ బుక్ వంటి మోజులో పడవద్దని, గంజాయికి దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు. మహిళలు, ప్రజలు పోలీసు వారికి సంబంధించిన ఎటువంటి సహాయం కావాలన్నా జిల్లా పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని, సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరు ద్విచక్ర వాహనంపై వెళ్ళేటప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ పెట్టుకుంటే ప్రమాదం జరిగినా ప్రాణాపాయం నుండి రక్షించుకోవచ్చునని తెలిపారు. అనంతరం ఇటీవల 10వ తరగతి ఫలితాలలో రెల్లివీధిలో అత్యధిక మార్కులు సాధించిన కుమారి ఉషా రాణి , లాస్యలను జిల్లా ఎస్పీ అభినందించి, సత్కరించి ప్రోత్సాహకంగా నగదు బహుమతిని అందచేసి, వీరిని ఆదర్శంగా తీసుకొని మిగతావారు మంచి స్థానాలకు చేరుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఎస్.రాఘువులు, 1వ పట్టణ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ఎస్సైలు సురేంద్ర నాయుడు, ఎస్.రవి, నీలావతి, కమల్ భార్గవ్ , ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి పనుల పరిశీలన



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** కడవకొల్లు పంచాయతీ పరిధి పొట్లపాడులో ఉపాధి హామీ పథకం అనుసంధానంతో జరుగుతున్న జలధార పనులను ఎంపీడీఓ జీఎస్ వి శేషగిరిరావు గురువారం పరిశీలిం చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈపనుల ద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని, ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడం జరుగుతుందన్నారు. ముదునూరులో ఒక నెల ఒక గ్రామం ఒకనెల ఒక గ్రామం నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా గురువారం ముదు నూరులో మూడవ వారం తహసీల్దార్ సురేశ్ కుమార్, ఎంపీడీఓ శేషగిరిరావు పర్యటించారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించి రైతులనుండి వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న భూము ల రీసర్వే పనులు, జనగణన పరిశీలించారు.

# విద్యార్థులకు యోగాసనాలు



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ఉయ్యూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ జి వేణు యోగాసనాలు నేర్పించారు. దేశంలో రాష్ట్రాలు, వాటి రాజధాను లు, నైతిక విలువల పై సీహెచ్ శ్వేత అవగాహన కల్పించారు. కథల పుస్తకాలు చదివిశీచి వాటిలో నీతిని వివరించారు. గ్రంథాలయ అధికారి బి రమణి, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు పలు అంశాలు తెలియచేశారు.

# ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఫలితాల్లో 'శ్రీ వివేక' విజయ దుందుభి:



**కందుకూరు, కలంకౌంటర్ :** ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం నేడు విడుదల చేసిన డిగ్రీ మొదటి సంవత్సరం, మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో కందుకూరు శ్రీ వివేక డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో విజయదుందుభి మోగించారని కళాశాల ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు ప్రకటించారు.విభాగాల వారీగా .. బీసీఏ విభాగంలో అమృత -- 98% (ప్రథమ స్థానం) వెంకటలక్ష్మి కుసుమ -- 93% (ద్వితీయ స్థానం)సుబీన్ -- 92% (తృతీయ స్థానం), బీకాం విభాగంలో అర్షియా -- 88% (ప్రథమ స్థానం) ఆయుష -- 85% (ద్వితీయ స్థానం), యశోద -- 82% (తృతీయ స్థానం)బీఎస్సీ విభాగంలో ప్రీతి -- 89% (ప్రథమ స్థానం)కె. సాయి వెంకట కీర్తి -- 87% (ద్వితీయ స్థానం)జి. స్రవంతి -- 85% (తృతీయ స్థానం) లు సాధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా బి.ఆర్.ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు మాట్లాడుతూ అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన లెక్చరర్లను ప్రత్యేకంగా అభినందించారు.విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాబోయే విద్యాసంవత్సరం నుండి బీకాం (బి. కామ్ ) తో పాటు ఏ .సి .సి .ఏ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామును శ్రీ వివేక డిగ్రీ కళాశాలలో ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. కొత్తగా చేరబోయే విద్యార్థులు ఈ అంతర్జాతీయ స్థాయి కోర్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు జి.బాలభాస్కర రావు, బి.నరేంద్ర బాబు, అకాడమిక్ ఇంచార్జ్ డి.శ్రీనివాసులు మరియు అధ్యాపక సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

# ఏ.పీ.ఎఫ్.డి. సి. చైర్మన్ గా భరత్ భూషణ్

- వైస్ చైర్మన్ గా మెహర్ రమేష్
- మరో 14 మందిని డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు



**అమరావతి,కలంకౌంటర్ :** ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిల్మ్ టివి థియేటర్ అభివృద్ధి సంస్థ (ఎఫ్.డి. సి.) చైర్మన్, డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్ గా నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ పి.భరత్ భూషణ్ పేరుకే మొగ్గు చూపించింది. వైస్ చైర్మన్ గా దర్శకుడు మెహర్ రమేష్ ను ఎంపిక చేసింది. 14 మంది డైరెక్టర్లను నియమించింది. సినీ రచయిత, తెనాలి కళల కాణాచి పరిషత్ నిర్వాహకులు బుర్రా సాయి మాధవ్, చిలకలూరిపేటకు చెందిన రిటైర్డ్ అధ్యాపకులు, రచయిత డా. కందిమళ్ల సాంబశివరావులను డైరెక్టర్లుగా నియమించారు. అలాగే హీరో సుమన్ తల్వార్, హీరో శివాజీ, నిర్మాతలు చదలవాడ శ్రీనివాసరావు, కూచిభోట్ల వివేకానంద, నటి ఝాన్సీ, సీనియర్ జర్నలిస్ట్ కె.ఉమా మహేశ్వరరావు, దర్శకుడు వి. సముద్ర, మీర్ ఎస్., ఎ.సత్యనారాయణ, ఎస్.వెంకట కృష్ణారెడ్డి, జి.రాజ్ వెంకటేశ్వర యాదవ్, డి. సత్యనారాయణ లను డైరెక్టర్లుగా నియమించారు. ఇక టివి, సినిమా నంది అవార్డులు, నంది నాటకోత్సవాలు ఈ కమిటీ ఆధ్వర్యంలో జరగనున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ లో సినిమా, టివి షూటింగులు జరిగేందుకు, సినీ, టివి, రంగస్థల కళాకారుల అభివృద్ధికి ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చిత్తశుద్ధితో కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# ఉపాధి పనులు జరిగే చోట టెంట్లు వేసి మజ్జిగ పంపిణీ చేయాలి....

- వైద్య కిట్లు అందుబాటులో ఉంచాలి....
- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** ఉపాధి హామీ సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం బంటుమిల్లి ఎంపీడీవో కి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నవి మే నెల కావడం వల్ల విపరీతమైన వడగాలి వీస్తున్నాయని ఉపాధి కూలీలు ఫోటోలు కోసం పడిగాపులు కాస్తూ మల మలా మాడే ఎండల్లో బాధపడుతున్నారన్నారు. ప్రభుత్వం చెప్పినట్లు గా పని ప్రదేశాల్లోని టెంటు వేయాలని మజ్జిగ పంపిణీ చేయాలని అలాగే వడగాల్పుల వల్ల పడిపోతే ప్రాథమిక వైద్యం చేసేందుకు మెడికల్ కిట్లు ఇవ్వాలని ప్రభుత్వం చెబుతోంది కానీ ఎక్కడా అధికారులు పై విధంగా పనిచేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం చెప్పినట్లుగా అధికారులు వెంటనే ఉపాధి పనులు జరిగే చోట ఎండ వేడిమి ని తట్టుకునేందుకు కనీసం టెంట్లేసి మజ్జిగ పంపిణీ చేసి మెడికల్ కిట్టు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తుందనీ చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బంటుమిల్లి ఎంపీడీవో కి ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నాగిశెట్టి కృష్ణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మండల కార్యదర్శి లంక దాసుల అజయ్ ఘోష మాజేటి శివ శ్రీనివాసరావు వెంట్రపాటి శ్యాము తదితరులు పాల్గొన్నారు

# ఆకస్మిక తనిఖీల్లో గంజాయిని గుర్తించిన నార్కోటిక్ డాగ్ "రుద్ర - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లా చీపురుపల్లి రైల్వే స్టేషను నుండి నెల్లిమర్ల రైల్వే స్టేషను మధ్య ఒడిస్సా రాష్ట్రం బ్రహ్మపుర నుండి విశాఖపట్నం మధ్య నడిచే పాసింజరు ట్రెయిన్ లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో నార్కోటిక్ డాగ్ "రుద్ర" విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చి గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను, వారి బ్యాగుల్లోని సుమారు 13.5 కిలోల 14 గంజాయి ప్యాకెట్లును గుర్తించినట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - రాష్ట్రంలో గంజాయి నియంత్రించేందుకు చేపడుతున్న చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ జిల్లాకు ఒక నార్కోటిక్ డాగ్ ను ఇటీవల మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా నార్కోటిక్ డాగ్ రుద్ర మంగళగిరిలో శిక్షణ పూర్తి చేసుకొని విజయనగరం జిల్లాకు రావడం జరిగిందన్నారు. ఈ డాగ్ రుద్రను గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు చేపట్టే ఆకస్మిక తనిఖీల్లో వినియోగిస్తున్నామన్నారు. చీపురుపల్లి - నెల్లిమర్ల రైల్వే స్టేషనుల మధ్య ఒడిస్సా రాష్ట్రం బ్రహ్మపుర నుండి విశాఖపట్నం వెళ్ళుచున్న పాసింజరు ట్రెయిన్ లో చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో పోలీసు అధికారులు, సిబ్బందితోపాటు నార్కోటిక్ డాగ్ రుద్ర కూడా పాల్గొన్నదన్నారు. నార్కోటిక్ డాగ్ రుద్ర పాసింజరు ట్రెయిన్లో గంజాయిని అక్రమంగా రవాణ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను, వారి బ్యాగుల్లోని సుమారు 13.5 కిలోలను (14 గంజాయి ప్యాకెట్లు) మే 21న గుర్తించిందన్నారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు కేరళ రాష్ట్రంకు చెందినవారని, వారిపై కేసు నమోదు చేసి, తదుపరి చర్యలు చేపట్టేందుకు పలాస జి.ఆర్.పి. పోలీసులకు అప్పగించామని జిల్లా ఎస్పీ తెలిపారు. గంజాయిని గుర్తించుటలో నార్కోటిక్ డాగ్ 'రుద్ర' మంచి ప్రతిభ కనబర్చినందున డాగ్ రుద్రను జిల్లా పోలీసు కార్యాలయంకు పిలిపించి, జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన నార్కోటిక్ డాగ్ రుద్రకు ప్రత్యేక అవసరాల కొరకు రూ.500/- రివార్డును జిల్లా ఎస్పీ ప్రకటించారు. వేసవి కారణంగా ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున డాగ్ ఆరోగ్యం, సంరక్షణ పట్ల జాగ్రత్త వహించాలని డాగ్ హ్యాండ్లర్స్ జగదీష్, నాగరాజులకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు.

# బడాయికి పోయి....పరువు బజారు పాలు

- దేవుడి కిరీటం తాకట్టు దేనికి సంకేతం?
- ఆలోచనలు గాడి తప్పి

**గుడివాడ,కలంకౌంటర్ :** సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహణ ,ఆధ్యాత్మిక సేవలు, కళ్యాణ మండపాలు నిర్మాణాలు ..ఇలా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాల్సిందే.కానీ మన స్థోమత,సాధ్యాసాధ్యాలు అంచనా వేసుకుని ముందుకు వెళ్ళాలి.నిర్దిష్టమైన లక్ష్యం లేకుండా,ప్రణాళిక లేకుండా బడాయి కోసం ప్రారంభిస్తే బజారు పాలు కాక తప్పదు. గుడివాడ లో బంగారు కిరీటం తాకట్టు వ్యవహారం అదే కోవకు చెందిందని పలువురు చెబుతున్నారు. దాతలు మాటూరి సుబ్బారావు దంపతులు లక్షలాది రూపాయలు వెచ్చించి వేంకటేశ్వరస్వామి వారికి బంగారు కిరీటం ఇస్తే దాన్ని కమిటీ వారు రూ 38 లక్షలకు తాకట్టు పెట్టారు.ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది.ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఆధునీకరించి ఏసీ కళ్యాణ మండపం గా మార్చేందుకు అవసరమైన నిధులు సేకరించలేకపోయారు.కారణం ఏదైనా ఇస్తామన్న దాతలు ఇవ్వలేదు.ఆ నిర్మాణం పూర్తి చేయడం కోసం కమిటీ వారు బంగారు కిరీటం తాకట్టు పెట్టారు.ఈ విషయం కిరీటం ఇచ్చిన దాతకు తెలిసి కమిటీ వారిని నిలదీశారు.పెద్ద రగడ జరిగి కమిటీ పరువు ప్రతిష్టలు మసకబారాయి.తాకట్టు పెట్టిన బంగారు కిరీటం నాలుగు రోజులు ఆలస్యం అయినా విడిపించి అప్పగిస్తారు.కానీ కనీసం ప్రణాళిక లేకుండా చేసిన ఈ తాకట్టు వ్యవహారం కమిటీ వారికి పూడ్చలేని నష్టాన్ని తెచ్చింది.

**ఆలోచనలు గాడి తప్పి.....** పేద విద్యార్థులు చదువు కోసం ,పేద ప్రజల వైద్యం కోసం సాయం చేయాలంటే మీన మేషాలు లెక్కిస్తున్నారు.నోరు తెరిచి సాయం చేయమని అడిగినా స్పందించే వారు తక్కువగా ఉన్నారు.కష్టాల్లో ఉన్నప్పుడు,నష్టాల్లో ఉన్నప్పుడు ,అత్యవసర సమయాల్లో అండగా నిలిచే పరిస్థితులు అంతంత మాత్రమే అని,ఆడంబరాలు, అన్నదానాలు, పదవులు కోసం,బడాయి కోసం, కీర్తి కిరీటాలు కోసం,ఊరేగింపులు, పూజలు,విందు వినోదాలు కోసం లక్షలు కాదు కోట్లు ఖర్చు పెడుతున్న పరిస్థితి ఉందని ,దీనికి కారణం ఆలోచనలు గాడి తప్పడమే నని మేధావులు అభిప్రాయ పడుతున్నారు.

# జిల్లా అధ్యక్షుడిగా పోలేపల్లి ప్రశాంత్



**పుట్టపర్తి,కలంకౌంటర్ :** పుట్టపర్తి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గా .పోలేపల్లి ప్రశాంత్ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ చైర్మన్ టీజీ వెంకటేష్,రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య చేతులు మీదుగా నియామకపత్రం తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలేపల్లి ప్రశాంత్ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో ఈ బాధ్యత అప్పగించిన టీజీ వెంకటేష్, ఇల్లూరు లక్ష్మయ్య లకు,సహకరించిన జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

**శుభాకాంక్షలు..** పుట్టపర్తి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గా నియమితులైన పోలేపల్లి ప్రశాంత్ కు ఏపీ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గం, జిల్లా కో ఆర్డినేటర్లు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎమ్మెల్యే నాగేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేత





**కందుకూరు, కలంకౌంటర్ :** గుడ్లూరు మండలం బసిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ లో.... 10వ తరగతి పరీక్షల్లో మొదటి నాలుగు స్థానాలు సాధించిన విద్యార్థులకు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం బహుమతులు అందజేశారు. మామిడాల ప్రేమ్ కుమార్ (571), యాళ్ల గీత (570), కుడుముల అక్షయ (568), యాళ్ల దీక్షితా రెడ్డి (566) లకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. హైస్కూల్ లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మార్తాటి జనార్ధన్.... ఒక్కొక్కరికి 5వేల రూపాయలు ఖర్చు చేసి, ఈ బహుమతులు అందించగా, ఎమ్మెల్యే నాగేశ్వరరావు గారు ఆయనను అభినందించారు. విద్యార్థులను కూడా అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామా కొండపనాయుడు, గొర్రెపాటి మధుసూదన్ రావు, జొన్నలగడ్డ వెంకటాద్రినాయుడు, రావెళ్ల సుధాకర్ రావు పాల్గొన్నారు

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎం ఎల్ ఏ ఇంటూరి

**--32 మందికి 23.2 లక్షల విలువైన చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే**





**కందుకూరు,కలంకౌంటర్ :** స్థానిక టిడిపి కార్యాలయంలో కందుకూరు అర్బన్, రూరల్ పరిధిలోని 32 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే నాగేశ్వ రావు , సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. కందుకూరు అర్బన్ పరిధిలో 16 మందికి 15,35,451 రూపాయలు మరియు రూరల్ మండలం పరిధిలో 16 మందికి 7,84,993 రూపాయల విలువైన చెక్కులను అందజేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత వైసిపి ప్రభుత్వంలో ఒకరికో ఇద్దరికో తప్ప సీఎంఆర్ఎఫ్ నిధులు పెద్దగా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతం గా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సాయం అందిస్తున్నట్లు చెప్పారు. కందుకూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 1313 మందికి 10.42 కోట్ల రూపాయల సహాయాలు అందించటం చాలా సంతోషం గా ఉందని ఎమ్మెల్యే ఇంటూరి పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆపరేషన్ల కోసం కేవలం 24 గంటల్లోనే ఎల్ ఓ సి లెటర్లు అందిస్తున్న ట్లు చెప్పారు. వైసిపి, కూటమి ప్రభుత్వాలలో... ప్రజలను ఆదుకుంటు న్నది ఎవరో ప్రతి ఒక్కరూ గమనించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సంద ర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ డబ్బులు తమ కుటు ంబాలకు ఎంతో ఆసరాగా ఉంటాయని, తమలాంటి పేదల పట్ల ఇంత శ్రద్ధ చూపిస్తున్న ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని లబ్ధిదా రులు దీవించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మే 22న రెడ్డిగూడెంలో ప్రత్యేక గ్రీవెన్స్

● స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, కలంకౌంటర్ :** ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువగా పరిపాలన అందించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించడం జరుగుతోందని.. ఈ నెల 22వ తేదీ శుక్రవారం రెడ్డిగూడెం మండలం, రెడ్డిగూడెంలోని కొత్త రెడ్డిగూడెంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి విజయ డెయిరీ కృష్ణా మిల్క్ యూనియన్ హాల్ లో కార్యక్రమం జరుగుతుందని, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు కూడా పాల్గొంటారని తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి వినతిని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

# మెగా క్లాప్: 30 ఏళ్ల రివర్స్ సీన్.. తమ్ముడి క్లాప్‌పై చిరంజీవి ఎమోషనల్

- నేడు లాంఛనంగా ప్రారంభమైన చిరంజీవి 158వ చిత్రం
- అన్నయ్య సినిమాకు క్లాప్ కొట్టిన తమ్ముడు పవన్ కల్యాణ్
- 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' సినిమాను గుర్తుకు తెచ్చుకున్న మెగాస్టార్







**హైదరాబాద్,కలంకౌంటర్ :** మెగాస్టార్ చిరంజీవి 158వ సినిమా పూజా కార్యక్రమాలతో ఈరోజు లాంఛనంగా ప్రారంభమైంది. ఈ ఓపెనింగ్ వేడుకకు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తన అన్నయ్య చిరంజీవిపై తీసిన ముహూర్తపు షాట్‌కు పవన్ కల్యాణ్ క్లాప్ కొట్టారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్లాప్ బోర్డ్ వెనుక ఉన్న ఒక అద్భుతమైన 30 ఏళ్ల నాటి విషయాన్ని గుర్తుచేస్తూ చిరంజీవి ఎక్స్‌లో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. "ఈ రోజు కల్యాణ్ బాబుకి, నాకు మధ్యలో క్లాప్ కనిపిస్తుంటే... 30 సంవత్సరాల క్రితం ఇదే సీన్ రివర్స్‌లో జరిగిన సందర్భం గుర్తుకు వస్తోంది ... 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈ రోజు డిప్యూటీ సీఎం హోదాలో టైమ్ తీసుకుని వచ్చి, నా 158వ సినిమా ముహూర్తంలో పాల్గొని, క్లాప్ ఇచ్చి యూనిట్ సభ్యులందరినీ ఆనందపరిచినందుకు థాంక్యూ" అని చిరంజీవి భావోద్వేగాన్ని వ్యక్తం చేశారు.

**ఫ్లాష్‌బ్యాక్:** సరిగ్గా 30 సంవత్సరాల క్రితం, పవన్ కల్యాణ్ హీరోగా సినిమా ఇండస్ట్రీకి పరిచయమైన క్లాసిక్ మూవీ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' (1996). ఆరోజు ఆ సినిమా ముహూర్తపు షాట్‌కు అన్నయ్యగా చిరంజీవి ముందుండి తమ్ముడు పవన్ కల్యాణ్‌కు క్లాప్ కొట్టి వెండితెరకు పరిచయం చేశారు. ఇవాళ అదే సీన్ రివర్స్ అయింది. ఆరోజు అన్నయ్య క్లాప్ కొట్టి తమ్ముడిని ఆశీర్వదించారు. ఈరోజు తమ్ముడు ఏకంగా ఒక రాష్ట్రానికి డిప్యూటీ సీఎం హోదాలో వచ్చి.. అన్నయ్య 158వ సినిమాకు క్లాప్ కొట్టారు. మూడు దశాబ్దాలు గడిచినా, మెగా బ్రదర్స్ మధ్య ఉన్న అనుబంధం మాత్రం అలాగే ఉందనడానికి ఈ క్లాప్ బోర్డ్ విజువల్ ఒక పెద్ద నిదర్శనం.



Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com